ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 24 నవంబరు 2025

జాబిలిపై చల్లని తల్లి












● చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించిన పద్మావతీ దేవి ● ఉదయం సూర్యప్రభపై కాంతులీనిన అమ్మవారు

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతీ దేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారు చంద్రప్రభ వాహనంపై వెన్నముద్దకృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి ఆభరణాలు, పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలలతో అలంకరించి, అధిష్ఠింపజేశారు. గజ, తురగ, అశ్వాలు ముందుకు సాగుతుండగా జియ్యర్ స్వాములు దివ్యవ ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యం, చిన్నారుల కోలాటం, భజన బృందం కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు సాగింది. ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చారు. యోగనారాయణుడి సూర్యప్రభ వాహనంపై పద్మావతీ అమ్మవారు భక్తులను కటాక్షించారు. తిరుమాడవీధుల్లో సూర్యప్రభ వాహనసేవ అత్యంత వేడుకగా సాగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి కేటీ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. జియ్యర్ స్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

● నేటితో ముగియనున్న వాహన సేవలు

పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న చిన్నశేష వాహనంతో ప్రారంభమైన వాహన సేవలు సోమవారం రాత్రి అశ్వ వాహనంతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.

రేపటితో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

మంగళవారం జరిగే పంచమి తీర్థంతో అమ్మవారి కార్తీక వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అదే రోజు తిరుమల నుంచి అమ్మవారికి శ్రీవారి సారె రానుంది.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9.15 గంటలకు రథోత్సవం

సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ

రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం

రథోత్సవానికి సర్వం సిద్ధం



తిరుచానూరు : అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం 9.15 గంటలకు ధనుర్‌లఘ్నంలో రథోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా రథాన్ని వివిధ కళాఖండాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సులువుగా తిరిగేందుకు వీలుగా తిరుమాడవీధుల్లో ఇసుక పరిచారు. అపశ్రుతులు దొర్లకుండా టీటీడీ, ఇంజనీరింగ్, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో ముందస్తుగా భద్రత చర్యలు తీసుకున్నారు. మాడవీధుల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు.

సత్యసాయి స్ఫూర్తితో సమాజ సేవ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పద్మావతి నగర్‌లో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొని సత్యసాయి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి ట్రస్టు చేపట్టిన సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా కరువ పరిస్థితులో ఉన్న సమయంలో బాగా ఆదుకున్నాయని తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులు ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు.



సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పద్మావతి ఆస్పత్రి మెడికల్ షాపు మూత

● స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి బ్రేక్ ● టీటీడీనే సొంతంగా నిర్వహించేందుకు కసరత్తు



పద్మావతి ఆస్పత్రిలో మూతపడిన మెడికల్ షాపు

శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద నామమాత్రపు అద్దెతో గడువు తీరిపోయినప్పటికీ పొడిగింపుతో కొనసాగుతున్న వైసీపీ వర్గీయుల మెడికల్ షాపును టీటీడీ రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం మూసివేశారు. లాభాపేక్ష లేకుండా మెడికల్ షాపు నిర్వహించేలా టీటీడీ పాలకమండలి సమావేశంలో ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. దీంతో వైసీపీ హయాంలో స్విమ్స్ ఆస్పత్రిలో మొదలైన పులివెందుల పెత్తనానికి బ్రేక్ పడినట్లయింది.

● మాఫియాకు షాక్

స్విమ్స్‌లో పద్మావతి జనరిక్ మెడికల్ షాపుతో పాటు గడువు తీరిన డాక్టర్ క్యాంటీన్‌ను కూడా మూసివేయించారు. టీటీడీ తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్ సువర్ణ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, స్థానిక పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది స్విమ్స్‌కు చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలకు ఉపక్రమించారు. తొలుత స్విమ్స్ ఓపీ విభాగం వద్ద ఉండే షాపును రద్దు చేయగలిగారు గాని పులివెందుల చేతిలో ఉన్న పద్మావతి ఆస్పత్రి వద్ద ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోయారు. తొలుత కేవలం రూ.17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించి, ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు. దాదాపు రూ.20లక్షలు అద్దె అవకాశం ఉన్నప్పటికీ మాఫియా ఒత్తిళ్లతో కొనసాగిస్తూ వచ్చారు. దీనిపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో టీటీడీ నాలుగు సార్లు టెండర్లు పిలిచింది. మెడికల్ మాఫియా రింగుగా మారి షాపులు పంచుకున్నారన్న ఆరోపణలున్నాయి. వీరు ఇంతకాలం కొనసాగడానికి రెవెన్యూ విభాగంలోని వైసీపీ వాసనలుపోని కొందరి సిబ్బంది ప్రమేయం ఉందన్న విమర్శలు ఉన్నాయి. ఈనేపథ్యంలో టీటీడీ చైర్మన్ నిర్ణయంతో మెడికల్ మాఫియా షాక్‌కు గురైంది.

● టీటీడీ షాపునకు కసరత్తు

స్విమ్స్ యాజమాన్యమే మెడికల్ షాపును గతంలో నిర్వహించింది. 20 ఏళ్ల క్రితం పాత క్యాజువాల్టీ సమీపంలో మెడికల్ షాపును స్విమ్స్ ఆధీనంలోని సిబ్బందే నిర్వహించారు. ఆ తర్వాత రాజకీయ జోక్యం పెరగడంతో ప్రైవేట్ వ్యక్తులు పాగా వేశారు. తాజాగా చైర్మన్ నిర్ణయంతో మళ్లీ స్విమ్స్ చేతికి ఫార్మసీ పగ్గాలు వెళ్లనున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోయినా, అర్జీల ప్రస్తుత పరిస్థితి తెలుసుకోవాలన్నా 1100కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పంచమి తీర్థం ముందస్తు భద్రతా చర్యలు ఉన్నందున సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఎవరూ జిల్లా కేంద్రానికి రావద్దని, సమీప పోలీసుస్టేషన్లకు వెళ్లాలని సూచించారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల వినియోగదారులు 8977716661కు ఫోన్‌చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీనంబర్లు 1912 లేదా 18004251555333లకు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

టైమ్స్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీయూకు చోటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీ యూనివర్సిటీకి చోటు దక్కింది. ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ ర్యాంకింగ్స్‌లో 601-800 మధ్య ర్యాంకు సాధించింది. తద్వారా యూనివర్సిటీ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల్లో ప్రపంచ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంది. మన దేశం నుంచి 88విద్యా, పరిశోధన సంస్థలు ఈ పోటీలో పాల్గొనగా పరిశోధనల్లో నాణ్యత, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలు, పర్యావరణ సంబంధ కృషిలో ఎస్వీయూ ప్రత్యేకతను నిరూపించుకుంది. ఎస్వీయూకు ర్యాంకు దక్కడం పట్ల వీసీ నరసింగరావు,రెక్టార్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

అన్నదాత సుఖీభవ డబ్బందలేదా!

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నిధులు జమకాని రైతులు అన్నదాత సుఖీభవ.ఏపీ.జీవోవీ.ఇఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేదంటే సమీప గ్రామ సచివాలయాల్లో అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

శ్రీసిటీలో స్మైలీ ఎకో ఇండస్ట్రీస్ ఉత్పత్తుల ప్రారంభం



ఉత్పత్తులను ప్రారంభిస్తున్న భువనేశ్వరి

సత్యవేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నాప్కిన్ తయారీ పరిశ్రమ స్మైలీ ఎకో ఇండస్ట్రీస్ తమ ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించింది. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేతుల మీదుగా శనివారం సంస్థ ఎండీ పరుచూరి మల్లికార్జున్ ప్రారంభించారు. మహిళలకు నెలసరిలో అవసరమయ్యే 10 వేల నాప్కిన్స్‌ను ఎన్టీఆర్ ట్రస్టుకు ఈ సందర్భంగా వితరణ చేసినట్లు ఆయన తెలిపారు.



ఎంవోయూ చేసుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ఐఐటీ, సీఈఎంఎస్ ఎంవోయూ

ఏర్పేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ, విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ మధ్య ఎంవోయూ కుదిరింది. సీఈఎంఎస్ సీఈవో గోపీకృష్ణ శివం, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఐఐటీ డైరెక్టర్ కే.ఎన్.సత్యనారాయణ, సీడీవో డీన్ అరుణ్ టంగిరాల మాట్లాడుతూ టెక్నాలజీ రంగాల్లో విద్యా-పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక అడుగుగా ఈ ఎంవోయూ నిలిచిందన్నారు. భవిష్యత్తు టెక్నాలజీకి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను, సంస్థలను శక్తివంతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ సాయికృష్ణ, సీఈఎంఎస్ జీఎం సబ్యసాచి మజుందార్, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతికి చేరుకున్న సిట్ బృందం

● నేటి నుంచి పరకామణి కేసు పునర్ విచారణ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : తిరుమల పరకామణి కేసు వారం రోజుల విరామం అనంతరం సోమవారం నుంచి పునర్ విచారణ ప్రారంభం కానుంది. సీఐడీ సిట్ బృందం ఆదివారం తిరుపతికి చేరుకుంది. పద్మావతి అతిథిగృహంలో పరకామణి చోరీ కేసులో తదనంతర పరిణామాలపై విచారణ మొదలుకానుంది. నిందితుడు రవికుమార్‌తో పనిచేసిన సిబ్బందితోపాటు కొంతమంది టీటీడీ పెద్దలను విచారించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రూ.14 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి ఇవ్వాలని ఎందుకు అనుకున్నారు? ఎవరు ఆదేశించారు? అనే విచారణ కీలకంగా మారనుంది.

28 నుంచి షోడశదిన సుందరకాండ పారాయణం

తిరుమల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం ఈ నెల 28 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు తిరుమలలోని వసంతమండపంలో షోడశదిన సుందరకాండ పారాయణం నిర్వహించనున్నారు. 27వ తేదీ సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో అంకురార్పణ చేయనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంత మండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్ఠానం నిర్వహించనున్నారు. డిసెంబరు 13వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య వేదవిజ్ఞానపీఠంలో పూర్ణాహుతితో ఈ కార్యక్రమం పరిసమాప్తి అవుతుంది.

తిరుమలేశుడి సేవలో నటి నిక్కీ

సినీ నటి నిక్కీ గల్రానీ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన నిక్కీని చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఫొటోలు తీసుకున్నారు. నిక్కీ ధరించిన ఆభరణాలను పలువురు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు నిక్కీ గల్రానీ

డిసెంబరు 31లోపు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోండి

● తిరుపతి సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని తిరుపతి సర్కిల్ పరిధిలోవున్న గృహ విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ వినియోగం కంటే అదనంగా వున్న లోడ్‌ను డిసెంబరు 31వ తేదీ లోపు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఎస్ఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. క్రమబద్ధీకరణ చేసుకోవలసిన సమయాన్ని ఈ ఏడాది చివరి వరకు పొడిగించి, రాయితీ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వినియోగదారులు పెరిగిన లోడ్‌కు అనుగుణంగా ఒక కిలో వాట్‌కు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని ఐదు జిల్లాల్లో వున్న విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు.

చైల్డ్ సేఫ్టీపై శిక్షణ



పిల్లలకు, తల్లిదండ్రులకు శిక్షణ ఇస్తున్న నారీసెల్ ఇంపాక్ట్ ట్రైనర్స్, సాగరిక, లత

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన చైల్డ్ సేఫ్టీ(బాలసురక్ష) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు ఆధ్వర్యంలో నారీసెల్ ఇంపాక్ట్ ట్రైనర్స్ జి.సాగరిక, ఆర్.లత పాల్గొని బాలసురక్ష కార్యక్రమం ద్వారా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చారు. లైంగిక వేధింపులు, లైంగిక దాడులను దీటుగా ఎదుర్కోవడం, భయాన్ని పోగొట్టడానికి సరైన నైపుణ్యంతో పిల్లలను తీర్చిదిద్దే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి దాదాపు వందమంది పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

6న సీపీఎస్ రద్దుకు చైతన్యయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న చీర్ల కిరణ్

మంగళం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని డిసెంబరు 6 నుంచి 10వ తేదీ వరకు కోనసీమజిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు మూడవ విడత చైతన్యయాత్ర నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని 2019లో ఉద్యోగుల ఓట్లతో జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యారన్నారు. హామీని అమలు చేయలేదన్నారు. అలాగే 2024 ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ సీపీఎస్ రద్దుకు పరిష్కారమార్గం చూపుతామని చెప్పి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా ఇంతవరకు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెన్షన్ ఉద్యోగుల హక్కు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంకీపురం పవన్, ప్రధాన కార్యదర్శి వల్లేటి మురళీమోహన్‌రెడ్డి, కోశాధికారి చలపతి, రాష్ట్ర కౌన్సిలర్లు రామచంద్ర, శ్రీహరిచౌదరి, సభ్యులు పవన్ కల్యాణ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తిరుపతి బాలబాలికల ప్రతిభ



కేతన్‌రెడ్డి, వేదశ్రీ, జోష్నిత

తిరుపతి(క్రీడలు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా విశాఖజిల్లాలో జరిగిన 10వ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తిరుపతి బాలబాలికలు ప్రతిభ చాటారు. రాష్ట్రవ్యాప్తంగా 260మంది ఈత క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించగా తిరుపతికి చెందిన శ్రీనివాస క్రీడా సముదాయంలో శిక్షణ పొందిన కేతన్‌రెడ్డి ఐదు విభాగాలలో 3 బంగారు, 2 వెండి పతకాలు, పి.వేదశ్రీ ఐదు విభాగాలలో 3 బంగారు, వెండి, బ్రాంజ్ ఒక్కొక్కటి చొప్పున, ఎస్.జోష్నిత రెండు విభాగాలలో రెండు బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. వీరిని పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.

తుడా, కార్పొరేషన్లలో ఘనంగా సత్యసాయి జయంతి

తిరుపతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు తిరుపతి నగరపాలక సంస్థ, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఆదివారం ఘనంగా జరిగాయి. తుడాలో కార్యదర్శి డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు, ఏవో డాక్టర్ శైలజ తదితరులు బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మేనేజర్ హసీమ్, డీఈ రాజు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొని బాబా సేవలను కొనియాడారు.

జీవకోనలో అలరించిన హరికథా గానం



ప్రత్యేక అలంకారంలో ద్రౌపదీ సమేత పాండవుల విగ్రహాలు

తిరుపతి(జీవకోన), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణ ద్రౌపది ధర్మరాజుల మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం హరికథా గానాన్ని డాక్టర్ వనారస విజయకుమారి భాగవతారిణిచే నిర్వహించారు. అనంతరం బకాసుర వధ నాటకాన్ని ప్రదర్శించారు. ద్రౌపదీసమేత పాండవుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోమవారం హరికథా గానంతో పాటు ద్రౌపదీ కల్యాణం, జూదం నాటకాలను ప్రదర్శించనున్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వీక్షించాలని నిర్వాహకులు అన్నా రామకృష్ణ, అన్నా మల్లీశ్వరి, సహ నిర్వాహకులు రవిరెడ్డి, ధనంజయరెడ్డి తెలిపారు.



తిరుపతిలో ప్రముఖ న్యూరోసర్జన్ ఏ. సుధాకరరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ ఏవీ శేషసాయి

తిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అంతకుముందు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన ఇద్దరు నారాయణ కోచింగ్ సెంటర్ నిర్వాహకులపై ఈస్ట్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన శివ శంకర్ నాయక్, బాబు నాయక్‌లు ఎస్వీయూలో ఎంఏ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరు తిరుపతిలోని నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌కు అడ్మిషన్ నిమిత్తం వెళ్లారు. ఆ సమయంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నారాయణతో పాటు స్నేహితుడు జగదీష్ అక్కడ వున్నారు. అడ్మిషన్ కోసం వెళ్లిన విద్యార్థులు తాము విద్యార్థి సంఘ నాయకులుగా చెప్పడంతో మాటా మాటా పెరిగింది. దీంతో జగదీష్ వారిపై దాడి చేస్తూ కులం పేరుతో దూషించారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై దాడి కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

డాక్టరేట్ ప్రదానం



వాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగ పరిశోధకురాలు ఎ. వాణి డాక్టరేట్ పొందారు. డేటా సైన్స్ టెక్నిక్స్ ఫర్ స్టాటిస్టికల్ మోడలింగ్ అంశంపై ఆమె సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. వాణి రూపొందించిన 10 పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 5 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ మేరకు వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉచిత శిక్ష ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శాంతస్ఫూర్తి సేవ ఫౌండేషన్ సంస్థ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇంటర్ పాస్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్, నగర పరిధి నివాసులు, 18నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి మాత్రమే ఈ అవకాశం. ఆధార్, 10వ తరగతి, ఇంటర్ మార్కులిస్టులు, రేషన్‌కార్డు జిరాక్సులు, పాస్‌పోర్టుసైజు రెండు ఫొటోలతో సోమవారం ఉదయం 10.30గంటలకు తాజ్‌హోటల్‌కు చేరుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులచే బుధవారం నుంచి 45రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 90004 69989, 83091 54991 నెంబర్లను సంప్రదించాలని శాంతస్ఫూర్తి సేవ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.

బంగారు గొడుగు ఉత్సవం



ఆలయ అధికారులకు బంగారు గొడుగును అందజేస్తున్న పంతులుగారి వంశీకులు

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం జరుగనుంది. ఆదివారం రాత్రి బంగారు గొడుగు ఉత్సవం నిర్వహించారు. పంతులుగారి ప్రస్తుత వంశీకుడైన రామనాథన్, పలువురు గొడుగును రథానికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏఈవో దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఈ వీధిలో నడక నరకప్రాయం



గుంతలమయమైన వీధి

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి అంగుళానికి బురద గుంతలు ఏర్పడిన ఈ వీధిలో సాక్షాత్తు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడు అనిమిని రవినాయుడు కార్యాలయం ఉంది. ఆయన కార్యాలయానికి వెళ్లాలంటే గుంతలు, బురద ప్రయాణం తప్పడం లేదు. ఇలా నగర పరిధిలో మట్టి వీధులున్న ప్రాంతాల ప్రజలు పీజీఆర్ఎస్‌లో మొరపెట్టుకున్నా ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నత్తనడక కల్వర్టు పనులతో నరకం చూపిస్తున్నారు!



కల్వర్టు పనులకోసం లోడేయడంతో కరువైన దారి

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర శివారు ప్రాంతం తిమ్మినాయుడుపాళెంలోని యాదవగ్రామంలో కల్వర్టు పనులు నత్తనడకన సాగుతుండడంతో గ్రామస్తులు నరకం చవిచూస్తున్నారు. కరకంబాడి రోడ్డు నుంచి యాదవగ్రామంలోకి ప్రవేశించే మార్గంలో ఎగువ నుంచి వచ్చే మురుగునీటి ప్రవాహానికి సంబంధించి పాత బ్రిడ్జి మరమ్మతులకు గురైంది. పైగా చిన్నదిగా ఉండడంతో వర్షపునీటితో పాటు మురుగు రోడ్డుపైకి వ్యాపించి కంపు కొడుతోంది. దుర్గంధం మధ్య ప్రజలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ స్పందించి కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టింది. నెల క్రితం ప్రాథమిక పనులు ప్రారంభించారు.దీంతో ఆ దారిలో రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో ప్రజలు ఇతర వీధుల నుంచి మలుపులు తిరుగుతూ అతికష్టంపై ప్రధాన రోడ్డుకు చేరుకుంటున్నారు. పైగా ఆ వీధులు కూడా వర్షాలతో గుంతలు ఏర్పడి, బురదలో కూరుకుపోయి వున్నాయి.బడిపిల్లల అవస్థలు వర్ణనాతీతం. స్కూల్ వ్యాన్లు దారి సరిగా లేక ఇళ్ల వద్దకు రాకపోవడంతో పిల్లలు బురదమధ్య నడవలేక అవస్థ పడుతున్నారు. రాత్రివేళ అదుపుతప్పి పడిపోతున్నారు.కార్పొరేషన్ అధికారులు స్పందించి కల్వర్టు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుమలలో వర్షం



పొగమంచులో శ్రీవారి ఆలయం - ఏఎన్సీ వద్ద కురుస్తున్న వర్షం

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో ఆదివారం విడతలవారీగా వర్షం కురిసింది. శనివారం నల్లటి మేఘాలు తిరుమలను కప్పేయగా, ఆదివారం వేకువజాము నుంచే చిరుజల్లులు మొదలయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు అప్పుడప్పుడు కురవగా, సాయంత్రం మాత్రం జోరు వర్షం కురిసింది.దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేసింది. చలితీవ్రత పెరిగింది.

మహిళా సమస్యల పరిష్కారానికి శ్రీకారం

● చంద్రగిరి, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, కోట మండలాల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలు



డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

మంగళం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గృహహింస, వరకట్నం, లైంగిక వేధింపులు, మానసిక వేదనకు గురిచేసే సంఘటనల నుంచి మహిళలను చైతన్యవంతులను చేస్తూ హక్కులు, న్యాయ సహాయాన్ని అందించడానికి కూటమి ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఎక్కువగా మహిళా సమస్యలు ఉత్పన్నమవుతున్న మండలాల జాబితాను తయారుచేసి ప్రయోగాత్మకంగా జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ పర్యవేక్షణలో మండల సమాఖ్య కార్యాలయాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తిరుపతి జిల్లాలో చంద్రగిరి, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, కోట మండలాల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వీటి నిర్వహణ కోసం ప్రతినిధులను ఎంపిక చేస్తామన్నారు. ఆపదలో ఉన్న మహిళలు జెండర్ రిసోర్స్ కేంద్రాలకు వెళ్లి తమ సమస్యలను తెలిపితే తగిన పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు.

తిరుపతిలో ప్రత్యేక సంస్కృత అకాడమి

● తెలుగు, సంస్కృత అకాడమి చైర్మన్ విల్సన్



మాట్లాడుతున్న విల్సన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని, తిరుపతిలో ప్రత్యేకంగా సంస్కృత అకాడమి ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని తెలుగు, సంస్కృత అకాడమి చైర్మన్ ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) పేర్కొన్నారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి, విజయవాడలో తెలుగు, సంస్కృత అకాడమి కార్యాలయాలు కొనసాగుతాయని, వాటిని తరలిస్తున్నారనే ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. గతంలో నిలిచిపోయిన తెలుగు అకాడమి జర్నల్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను తీసుకొస్తామని, 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాల ప్రచురణ బాధ్యతను అకాడమి చేపట్టే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. పాఠ్య పుస్తకాలను సొంతంగా ప్రచురించి, వ్యాపారం చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తెలుగులో చదవడం, మాట్లాడటం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించాలని భావిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర విభజన క్రమంలో ఏపీకి రావాల్సిన నిధులను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలుగు, సంస్కృత అకాడమి పరిధిలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న వారికి టైంస్కేల్ వర్తింపజేయాలని ఆలోచిస్తున్నామన్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అకాడమి అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, అప్పట్లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపడతామని వెల్లడించారు.

కుప్పలు తెప్పలుగా చెత్త నిల్వలు

● పాడైన చెత్త తరలించే బండ్లు



యాదవ గ్రామ వీధుల్లో చెత్తకుప్పలు, వాటిపైన నిరుపయోగంగా ఉన్న చెత్త తరలించే బండ్లు

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిమ్మినాయుడుపాళెం యాదవ గ్రామంలోని పలువీధుల్లో వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. చెత్త తరలించే బండ్లు పాడైపోవడంతో వీటితో పనిచేయలేమని సిబ్బంది వాటిని కూడా బోర్లించేశారు. నెలలు తరబడి నిరుపయోగంగా ఉండడంతో అవి తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చెత్తకుప్పలు కుళ్లిపోయి కంపుకొడుతున్నాయి. ఈగలు, దోమలు ప్రబలుతున్నాయని పారిశుధ్య అధికారులకు గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి చెత్త నిల్వలు తరలించడంతో పాటు బండ్లకు కూడా మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య వెల్లడించారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ లేబర్ కోడ్‌ల అమలుకు నిరసనగా 26వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మిక, కర్షక, రైతుకూలీ, ప్రజా సంఘాలతో కలిసి మహాధర్నా చేస్తున్నట్లు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయడానికి అన్ని కార్మిక సంఘాలు ఐక్యమత్యంతో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. 2026 ఏప్రిల్ చివరి వారంలో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను తిరుపతిలో నిర్వహించాలని, అందుకు తిరుపతి జిల్లా కౌన్సిల్ సన్నద్ధం కావాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ నాగసుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా, నగర సమితి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.








కనువిందుగా.. కళా ప్రదర్శనలు

శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి వాహన సేవల్లో దేశం నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు భక్తులకు నేత్రానందం కలిగిస్తున్నాయి. ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహనంలో పాండిచేరి కరైకల్‌కు చెందిన కళాకారులు నెమలిడ్యాన్స్, చెన్నై బృందం కేరళా ఫోక్ డ్యాన్స్, అరకుకు చెందిన బింస సంప్రదాయ నృత్యం, తెలంగాణ బృందం పేరుని నాట్యం, తిరుపతి నగరానికి చెందిన రమ్య బృందం మోహిని అట్టం, భరతనాట్యం, కూచిపూడి భక్తులను ఆకట్టుకుంది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి






సమాజ శ్రేయస్సుకు దాతలు ముందుకు రావాలి

- కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన సుధారెడ్డి


కమ్మపల్లిలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న సుధారెడ్డి తదితరులు

రామచంద్రాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కమ్మపల్లి గ్రామంలో రూ.30లక్షల వ్యయంతో గుర్రం చందమౌళి నాయుడు జ్ఞాపకార్థం ఆయన భార్య ఇంద్రాణి నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం సుధారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల క్రితం రూ.15లక్షల ప్రభుత్వ నిధులతో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించినా నిధులు లేక ఆగిపోయిందన్నారు. దీనిని పూర్తిచేయడానికి చంద్రమౌళి నాయుడు భార్య ఇంద్రాణి తన సొంత డబ్బు రూ.30లక్షలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చిన్నబాబు, మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు, నీలకంఠ చౌదరి, మాజీ ఎంపీటీసీ సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సద్గురు మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠ


మలయాళస్వామికి పూజలుచేస్తున్న ఆశ్రమ పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు సద్గురు మలయాళ స్వామి విగ్రహాన్ని పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిష్ఠించారు. తిరుపతి నుంచి ఏర్పేడు - వెంకటగిరికి వెళ్లే మార్గంలో వంతెన ఎదురుగా రాతి మండపంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంతో పాటు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. వందలాదిమంది ఆశ్రమ పూర్వ విద్యార్థులు పాల్గొని స్వామివారిని పూజించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులకు ఆశ్రమ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

టీటీడీ ఇంజనీరింగ్, కాంట్రాక్టరు అత్యుత్సాహం

- తిరుచానూరులో రోడ్డు మూత
- ఉన్నతాధికారుల చివాట్లతో యథావిధిగా రాకపోకలు


ఘంటసాల విగ్రహం వద్ద రోడ్డుమూసేసిన కాంట్రాక్టరు

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పంచమి తీర్థానికి వచ్చే భక్తులు వేచి ఉండేందుకు ఘంటసాల విగ్రహం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల వరకు రోడ్డుపై రేకుల షెడ్ ఏర్పాటు చేశారు. అక్కడ వరకు బాగానే ఉంది. పంచమితీర్థంకు ఇంకా రెండు రోజులు ఉండగానే ఇంజనీరింగ్ అధికారులు, క్యూలైన్లు ఏర్పాటుచేసే కాంట్రాక్టరు అత్యుత్సాహం ప్రదర్శించి ఘంటసాల విగ్రహంనుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఉన్న ప్రధానరోడ్డును ఆదివారం ఉదయం మూతవేశారు. అక్కడ ఎలాంటి నిర్మాణపనులు జరగకపోయినా మూసేశారు. ప్రధాన రోడ్డు ఒకవైపు మూత వేయడంతో మరోవైపు దాదాపు మూడుగంటలపాటు భక్తులు నరకం చూశారు. విషయం తెలుసుకున్న టీటీడీ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు చివాట్లు పెట్టడంతో వెంటనే ఘంటసాల విగ్రహం వద్ద మూత వేసిన రోడ్డుకు బారికేడ్లను తొలగించారు.


హోల్డింగ్ పాయింట్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

రేపు పంచమి తీర్థం

- చక్రస్నానానికి సర్వం సిద్ధం
- ప్రతి ఒక్కరూ హోల్డింగ్ పాయింట్ నుంచే పుష్కరిణిలోకి
- ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు
- 2వేలమంది పోలీసులతో బందోబస్తు


పంచమి తీర్థానికి సిద్ధమైన అమ్మవారి పుష్కరిణి

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం పంచమి తీర్థానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. చక్రస్నానం కోసం పుష్కరిణి సిద్ధమైంది. మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటలకు అభిజిత్, కుంభలగ్నంలో కోనేటిలో చక్రస్నానం నిర్వహిస్తారు. కొత్త నీటితో పుష్కరిణి కళకళలాడుతోంది. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. లక్ష మంది భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేయడానికి ప్రత్యేకంగా 150 కౌంటర్లు ఏర్పాటు చేశారు. జేఈవో వీరబ్రహ్మం ఆదివారం తిరుచానూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్లను పరిశీలించారు. పంచమితీర్థం రోజున పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తే అలమేలుమంగమ్మ సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే చక్రస్నానానికి వేలాది మంది భక్తులు తిరుచానూరు రానున్నారు. 20 వేల మంది ఒకసారి పద్మసరోవరంలో పుణ్యస్నానం ఆచరించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. తిరుచానూరు గ్రామ ముఖద్వారాల్లో టీటీడీ ప్రత్యేకంగా హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఆ పాయింట్ నుంచి పుష్కరిణి(కోనేరు) వరకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే పుష్కరిణిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి వైపు నుంచి భక్తులకు నవజీవన్ ఆస్పత్రి వద్ద, వడమాలపేట, అప్పలాయగుంట, పూడి మార్గం నుంచి వచ్చే వారి కోసం తిరుచానూరు గోశాల(స్వర్ణముఖి నది ఒడ్డున) వద్ద ఏర్పాటు చేశారు. స్థానికులు, భక్తుల కోసం తిరుచానూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. పూడి సర్కిల్ నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా టీటీడీ ఉద్యోగులు, మీడియా వారు పుష్కరిణిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. హోల్డింగ్ పాయింట్లలో అన్న ప్రసాదాలు, పాలు, బిస్కెట్లు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు.

భారీ భద్రత : పంచమితీర్థం రోజు భద్రత నిమిత్తం 1500 మంది పోలీసులు, 400 మంది టీటీడీ సిబ్బందిని నియమించారు. వీరితో పాటు 200 మంది స్కౌట్స్, 200 మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఏర్పాటు చేసింది. అంబులెన్స్‌లు, వైద్యులు, ప్రథమ చికిత్స కేంద్రాలను అందుబాటులో ఉంచారు. పుష్కరిణి, ఆలయ పరిసర ప్రాంతాల్లో 129 సీసీ కెమెరాలు, 9డ్రోన్లు వినియోగిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా భద్రత చర్యలు చేపట్టినట్లు ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

తిరుచానూరు గ్రామంలోకి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు వాహనాలకు అనుమతి లేదని అడిషనల్ ఎస్పీ రవిమనోహచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను చెర్లోపల్లి వైపు మళ్లిస్తారు. చెన్నై, శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనాలు గాజులమండ్యం, రేణిగుంట, ఆటోనగర్ మీదుగా తిరుపతికి వెళ్లాల్సి ఉంటుంది. పూడి వైపు నుంచి వచ్చే వాహనాలను అప్పలాయగుంట రోడ్డులో మళ్లించనున్నారు. పూడి నుంచి వచ్చే వాహనాలకు ముండ్లపూడి క్రాస్ వద్ద, తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు మార్కెట్ యార్డు, శిల్పారామం వద్ద పార్కింగ్ కేటాయించారు. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను తాజ్‌హోటల్ రోడ్డులోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. రేణిగుంట నుంచి వచ్చే వాహనాలకు నారాయణాద్రి ఆస్పత్రి వద్ద పార్కింగ్ కేటాయించారు.

హోరాహోరీగా అంతర్‌జిల్లా అండర్-14 హాకీ పోటీలు

- నేడు సెమీఫైనల్స్



చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హాకీ ఆడుతున్న బాలుర, బాలికల జట్లు

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రెండో రోజైన ఆదివారం అంతర్ జిల్లా అండర్-14 హాకీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. లీగ్ పోటీలను నాలుగు గ్రూపులుగా విభజించారు. వీటిలో విన్నర్స్, రన్నర్స్‌గా బాలుర జట్లు ఎనిమిది, బాలికల జట్లు ఎనిమిది నాకౌట్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ దశలో నిర్వహించిన బాలుర మొదటి క్వార్టర్ ఫైనల్‌లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి జట్ల మధ్య మ్యాచ్ జరగగా 4-3 గోల్స్‌తో విశాఖ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో కర్నూలుపై తూర్పుగోదావరి 4-0 గోల్స్‌తో, మూడవ మ్యాచ్‌లో కడప, నెల్లూరుపై 5-0 గోల్స్ తేడాతో, నాలుగవ మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళంపై 2-1 గోల్స్ తేడాతో గెలిచి, సెమీఫైనల్స్‌కి చేరాయి. అలాగే బాలికల మ్యాచ్‌ల్లో నాకౌట్ దశలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్‌లో మొదటి మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై, విశాఖపట్నం జట్టు 1-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై, తూర్పుగోదావరి 8-0 గోల్స్ తేడాతో, మూడో మ్యాచ్‌లో కడప, నెల్లూరుపై 9-0 గోల్స్ తేడాతో, నాల్గవ మ్యాచ్‌లో అనంతపురం జట్టు, కర్నూలు జట్టుపై 7-0 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌కి ప్రవేశించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్, భార్గవి, దేవి, అబ్జర్వర్ థామస్, ఆర్కే సెలవపాండెనే, కేశవయ్య, హరికృష్ణ, కిరణ్‌కుమార్, ప్రభాకర్, జేమ్స్, చంద్రశేఖర్, శ్రీనివాసులు ఆచారి, కిరణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు జరిగే సెమీఫైనల్స్ మ్యాచ్‌లు

బాలుర జట్లలో విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య మొదటి సెమీఫైనల్, వైయస్ఆర్ కడప, అనంతపురం జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. బాలికల జట్లలో మొదటి సెమీఫైనల్ వైయస్సార్ కడప, విశాఖపట్నం జట్ల మధ్య, రెండో సెమీఫైనల్ తూర్పుగోదావరి, అనంతపురం జిల్లా జట్ల మధ్య జరుగుతాయి.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

కార్యకర్త కుటుంబానికి జనసేన సాయం

రామచంద్రాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం, రాయలచెరువు పంచాయతీకి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు పెనుగొండ లోకేష్ ప్రమాదవశాత్తు మృతిచెందిన విషయం తెలిసిందే. పార్టీ కోసం పనిచేసిన లోకేష్ కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆయన సతీమణి యామినికి రూ.5 లక్షల చెక్కును ఆదివారం తాడేపల్లిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా అందజేశారు. మనోహర్ మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన లోకేష్ సేవలు మరువలేనివన్నారు. కష్టసమయంలో కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉండటం గొప్ప విషయమన్నారు.

మంచు విష్ణు జన్మదిన వేడుకలు

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్ మంచు విష్ణు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఎ.రంగంపేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మౌళి, కిషోర్, కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు భగవాన్ సత్యసాయి


చిన్నగొట్టిగల్లులో సత్యసాయికి అంజలి ఘటిస్తున్న అధికారులు

భాకరాపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. భగవాన్ సత్యసాయి జయంతి సందర్భంగా చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్ సతీష్‌కుమార్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 6న దశ సహస్ర సువాసిని పూజలు


పోస్టరు ఆవిష్కరిస్తున్న రమ్యానంద భారతి

రామచంద్రాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు శ్రీశక్తి పీఠం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 6న పదివేల మంది మహిళలతో నిర్వహించనున్న దశ సహస్ర సువాసిని పూజల పోస్టర్‌ను కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి, ఆర్‌సీపురం మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వంద మంది మహిళలకు సారె అందజేశారు. మరకతశక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

వర్గీకరణపై ఉద్యమించాలి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న చింతామోహన్, విజయకుమార్ తదితరులు

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు మాలలకు అన్యాయం చేశాయని పలువురు వక్తలు విమర్శించారు. దీనిపై గట్టిగా ఉద్యమించాలని వారు కోరారు. కోటలో ఆదివారం రాత్రి బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఐఏఎస్ అధికారి విజయకుమార్, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్, రచయిత, గాయకుడు, రేంజర్ల రాజేష్, గెజిటెడ్ మాల ఉద్యోగుల కార్యదర్శి శ్రీనివాసరావు, మాల ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, గౌరవాధ్యక్షుడు దాసరి సుందరంలు ప్రసంగించారు. ఏబీసీడీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం బలంగా చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. ఏపీలో ఇప్పటికే పోరాటానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఆర్టీసీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదిక వరకూ మోటారు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక నాయకులు పాలా మల్లికార్జునరావు, పనబాక హేమంత్, సాయి, అశోక్‌కాంబ్లే, పోలయ్య, కోటేశ్వరరావు, కేశవ, డీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కరువు



పాకాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంటపల్లె పంచాయతీ యల్లంపల్లె వద్ద జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. అట్టహాసంగా భూమి చదును చేసి అప్పట్లో ప్లాట్లు కేటాయించి, ఇళ్లు మంజూరు చేసేశారు. రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ఈ కాలనీలో 262 గృహాలు మంజూరు చేశారు. పంటపల్లె నుంచి 600 మీటర్ల రోడ్డు వేయకపోవడంతో ఈ కాలనీకి చేరుకోవాలంటే 6 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావలసిందే. మండల కేంద్రం నుంచి ఆటో వెళ్లాలన్నా కష్టమే. దీంతో ఈ కాలనీలో పదిశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదు. 40 శాతం నిర్మాణాలు వివిధ దశల్లో వున్నాయి. పునాది దశల్లో కొన్ని వున్నా పునాదికి నోచుకోనివి చాలా వున్నాయి.







కనులిందుగా.. కళా ప్రదర్శనలు

శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి వాహన సేవల్లో దేశం నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు భక్తులకు నేత్రానందం కలిగిస్తున్నాయి. ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహనంలో పాండిచేరి కరైకల్‌కు చెందిన కళాకారులు నెమలిడ్యాన్స్, చెన్నై బృందం కేరళా ఫోక్ డ్యాన్స్, అరకుకు చెందిన బింస సంప్రదాయ నృత్యం, తెలంగాణ బృందం పేరుని నాట్యం, తిరుపతి నగరానికి చెందిన రమ్య బృందం మోహిని అట్టం, భరతనాట్యం, కూచిపూడి భక్తులను ఆకట్టుకుంది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి









తిరుపతిలో ప్రత్యేక సంస్కృత అకాడమీ

- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ విల్సన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని, తిరుపతిలో ప్రత్యేకంగా సంస్కృత అకాడమీ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) పేర్కొన్నారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి, విజయవాడలో తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాలు కొనసాగుతాయని, వాటిని తరలిస్తున్నారనే ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. గతంలో నిలిచిపోయిన తెలుగు అకాడమీ జర్నల్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను తీసుకొస్తామని, 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాల ప్రచురణ బాధ్యతను అకాడమీ చేపట్టే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. పాఠ్య పుస్తకాలను సొంతంగా ప్రచురించి, వ్యాపారం చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తెలుగులో చదవడం, మాట్లాడటం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించాలని భావిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర విభజన క్రమంలో ఏపీకి రావాల్సిన నిధులను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ పరిధిలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న వారికి టైంస్కేల్ వర్తింపజేయాలని ఆలోచిస్తున్నామన్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అకాడమీ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, అప్పట్లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపడతామని వెల్లడించారు.

నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే



నిశ్చితార్థ వేడుకల్లో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన నిశ్చితార్థ వేడుకల్లో సీఎం చంద్రబాబుతో కలసి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. దొరవారిసత్రం మండలం తనియాలికి చెందిన పారిశ్రామికవేత్త లోకాద్రినాయుడు కుమారుడి నిశితార్థ వేడుక విజయవాడలో ఆదివారం జరిగింది. ఆ వేడుకలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పీఎసీఎస్ అధ్యక్షుడు బాలచంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడే విజయకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెందోడులో రక్తదాన శిబిరం



కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెందోడులో ఆదివారం ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. శిబిరాన్ని వైసీసీ నాయకులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. గూడూరుకు చెందిన మెడీపల్స్ రక్తనిధి దాతల ద్వారా రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను దువ్వూరు శ్రీనివాసులురెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు ఎం లీలామోహన్, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వాటంబేడు రోడ్డంటే హడలే..



తడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయం నుంచి తడ మండలం వాటంబేడుకు సుమారు 10 కిలోమీటర్ల మేర తారురోడ్డు ఉంది. 2016లో ఈ రహదారిని అప్పటి ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లతో నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈరోడ్డు కొంతమేర దెబ్బతింది. గతేడాది కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తాత్కాలిక మరమ్మతులు చేసింది. ఇటీవల వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

రేపు పంచమి తీర్థం

- చక్రస్నానానికి సర్వం సిద్ధం
- ప్రతి ఒక్కరూ హోల్డింగ్ పాయింట్ నుంచే పుష్కరిణిలోకి
- ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు
- 2వేలమంది పోలీసులతో బందోబస్తు



తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం పంచమి తీర్థానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. చక్రస్నానం కోసం పుష్కరిణి సిద్ధమైంది. మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటలకు అభిజిత్, కుంభలగ్నంలో కోనేటిలో చక్రస్నానం నిర్వహిస్తారు. కొత్త నీటితో పుష్కరిణి కళకళలాడుతోంది. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. లక్ష మంది భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేయడానికి ప్రత్యేకంగా 150 కౌంటర్లు ఏర్పాటు చేశారు. జేఈవో వీరబ్రహ్మం ఆదివారం తిరుచానూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్లను పరిశీలించారు. పంచమితీర్థం రోజున పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తే అలమేలుమంగమ్మ సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే చక్రస్నానానికి వేలాది మంది భక్తులు తిరుచానూరు రానున్నారు. 20 వేల మంది ఒకసారి పద్మసరోవరంలో పుణ్యస్నానం ఆచరించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. తిరుచానూరు గ్రామ ముఖద్వారాల్లో టీటీడీ ప్రత్యేకంగా హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఆ పాయింట్ నుంచి పుష్కరిణి(కోనేరు) వరకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే పుష్కరిణిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి వైపు నుంచి భక్తులకు నవజీవన్ ఆస్పత్రి వద్ద, వడమాలపేట, అప్పలాయగుంట, పూడి మార్గం నుంచి వచ్చే వారి కోసం తిరుచానూరు గోశాల(స్వర్ణముఖి నది ఒడ్డున) వద్ద ఏర్పాటు చేశారు. స్థానికులు, భక్తుల కోసం తిరుచానూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. పూడి సర్కిల్ నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా టీటీడీ ఉద్యోగులు, మీడియా వారు పుష్కరిణిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. హోల్డింగ్ పాయింట్లలో అన్న ప్రసాదాలు, పాలు, బిస్కెట్లు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు.

భారీ భద్రత

పంచమితీర్థం రోజు భద్రత నిమిత్తం 1500 మంది పోలీసులు, 400 మంది టీటీడీ సిబ్బందిని నియమించారు. వీరితో పాటు 200 మంది స్కౌట్స్, 200 మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఏర్పాటు చేసింది. అంబులెన్స్‌లు, వైద్యులు, ప్రథమ చికిత్స కేంద్రాలను అందుబాటులో ఉంచారు. పుష్కరిణి, ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా భద్రత చర్యలు చేపట్టినట్లు ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

తిరుచానూరు గ్రామంలోకి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు వాహనాలకు అనుమతి లేదని అడిషనల్ ఎస్పీ రవిమనోహచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను చెర్లోపల్లి వైపు మళ్లిస్తారు. చెన్నై, శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనాలు గాజులమండ్యం, రేణిగుంట, ఆటోనగర్ మీదుగా తిరుపతికి వెళ్లాల్సి ఉంటుంది. పూడి వైపు నుంచి వచ్చే వాహనాలను అప్పలాయగుంట రోడ్డులో మళ్లించనున్నారు. పూడి నుంచి వచ్చే వాహనాలకు ముండ్లపూడి క్రాస్ వద్ద, తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు మార్కెట్ యార్డు, శిల్పారామం వద్ద పార్కింగ్ కేటాయించారు. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను తాజ్‌హోటల్ రోడ్డులోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. రేణిగుంట నుంచి వచ్చే వాహనాలకు నారాయణాద్రి ఆస్పత్రి వద్ద పార్కింగ్ కేటాయించారు.

శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం



పగుళ్లు ఏర్పడిన సీలింగ్



పాతబడిన కార్యాలయం

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది.ఎప్పుడు ఏం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.ఈ కార్యాలయం మూడు దశాబ్దాల క్రితం నిర్మించారు. లోపలి గదుల్లో సీలింగ్ దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. సిబ్బందిపై పడుతున్నాయి. ప్రస్తుత వర్షాలకు గదులన్నీ పూర్తిగా ఉరుస్తున్నాయి. విలువైన రికార్డులు తడిసిపోతున్నాయి. వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్ఐలు, విలువైన రికార్డులు ఉండే గదుల గోడలు పూర్తిగా పగుళ్లిచ్చాయి. పెచ్చులూడిపోతున్నాయి. కార్యాలయంలోని పలు గదులకు కిటికీలు లేకపోవడంతో సిబ్బంది అర్జీదారులు తడుస్తూనే విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పలుపనులపై కార్యాలయంకు వచ్చే ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. తాజా వర్షాలకు ఎక్కడ ఏం కూలుతుందోనని రెవెన్యూ సిబ్బంది హడలిపోతున్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి భజన



గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుమ్మరవీధిలోని సత్యసాయి ప్రేమసుధా మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయిసత్య వ్రతం నిర్వహించి భజనలు చేశారు. బాబాను అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వర్గీకరణపై ఉద్యమించాలి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న చింతామోహన్, విజయకుమార్ తదితరులు

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు మాలలకు అన్యాయం చేశాయని పలువురు వక్తలు విమర్శించారు. దీనిపై గట్టిగా ఉద్యమించాలని వారు కోరారు. కోటలో ఆదివారం రాత్రి బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఐఏఎస్ అధికారి విజయకుమార్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్, రచయిత, గాయకుడు, రేంజర్ల రాజేష్, గెజిటెడ్ మాల ఉద్యోగుల కార్యదర్శి శ్రీనివాసరావు, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, గౌరవాధ్యక్షుడు దాసరి సుందరం ప్రసంగించారు. ఏబీసీడీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి ఏపీలో ఇప్పటికే పోరాటానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఆర్టీసీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదిక వరకూ బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక నాయకులు పాలా మల్లికార్జునరావు, పనబాక హేమంత్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట, చిల్లకూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడనుంది. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ ఈఈ నరేంద్రరెడ్డి కోరారు. నాయుడుపేట, కృష్ణపట్నం పోర్టు ఎక్స్‌ప్రెస్ వేకు సంబంధించి చెందోడు సబ్‌స్టేషన్ పరిధిలో 132 కేవీ లైన్ టవర్ల నిర్మాణ నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కోట మండలం, కోట, విద్యానగర్, సిద్ధవరం, కొత్తపాళెం, చిల్లకూరు మండలంలోని చింతవరం, వరగలి, తమ్మినపట్నం ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఓల్టేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.. ఈ పనులను ట్రాన్స్‌కో ఈఈ బాలకేశవులు, డీఈలు ప్రసాద్, చిన్నయ్యలు పర్యవేక్షిస్తారని తెలిపారు.

డిసెంబరు 31లోపు అదనపు లోడు క్రమబద్ధీకరించుకోండి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని తిరుపతి సర్కిల్ పరిధిలోవున్న గృహ విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ వినియోగం కంటే అదనంగా వున్న లోడ్‌ను డిసెంబరు 31వ తేదీ లోపు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఎస్ఈ వి.చంద్రశేఖర రావు తెలిపారు. క్రమబద్ధీకరణ చేసుకోవలసిన సమయాన్ని ఈ ఏడాది చివరి వరకు పొడిగించి, రాయితీ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వినియోగదారులు పెరిగిన లోడ్‌కు అనుగుణంగా ఒక కిలో వాట్‌కు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సూళ్లూరుపేటకు చెందిన శ్రీనివాసులు స్నేహితుడితో ఆదివారం రాత్రి కారులో తడకు బయలుదేరాడు. మాంబట్టు సెజ్ రోడ్డువద్ద రాంగ్‌రూట్‌లో ఓ బైక్ కారును ఎడమవైపు ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న టింకు కుమార్, కాఖలేష్ కుమార్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరు బీహార్ రాష్ట్రానికి చెందిన వారు. మాంబట్టు సెజ్‌లోని ఓ పరిశ్రమలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నట్లుగా తెలుస్తుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు, ఆహారపొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మోహన్, వేణు దాతృత్వంతో చలికాలంలో పేదలకు దుప్పట్లను అందజేశామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, అమరయ్య, గోకుల్, పవన్, జశ్వంత్, శ్రీనివాసులు, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నిరాదరణకు గురైన వృద్ధులను గుర్తించి వారికి నెలకు సరిపడా నిత్యావసరాలను తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దశరధరామిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సద్గురు మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠ


మలయాళస్వామి విగ్రహం వద్ద ఆశ్రమ పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వ్యాసా శ్రమ వ్యవస్థాపకుడు సద్గురు మలయాళస్వామి విగ్రహాన్ని పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిష్ఠించారు. తిరుపతి నుంచి ఏర్పేడు - వెంకటగిరికి వెళ్లే మార్గంలో వంతెన ఎదురుగా రాతి మండపంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంతో పాటు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అదే విధంగా వందలాదిమంది ఆశ్రమ పూర్వవిద్యార్థులు పాల్గొని స్వామివారిని పూజించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన వారికి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తారా వితస్త గంజు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానేవంద్రనాథ్ రాయ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తారా వితస్త గంజు దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్త జనసంద్రం... ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం ఆదివారం భక్తుల జనసంద్రంగా మారింది. ఆదివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 29 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ టిక్కెట్ల ద్వారా 539 మంది, రూ.200 శీఘ్ర దర్శనం 2,256 మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,756 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,483మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 819, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 293, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 201, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 85మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 22,443 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆధారాల సేకరణ



రేణిగుంట నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి సమీపంలోని అమరరాజా పరిశ్రమ ఉద్యోగుల క్వార్టర్స్‌లో జరిగిన చోరీపై పోలీసులు ఆధారాలను సేకరించారు. ఆదివారం ఉదయం నుంచి కరకంబాడి అమరరాజా ఉద్యోగుల క్వార్టర్స్‌లో ప్రతి ఇంటిని పరిశీలించారు. అలాగే దొంగలు వచ్చిన మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషిస్తున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేకంగా మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. మొబైల్ ఫోన్ సిగ్నల్ల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

పుత్తూరు వార్తలు

ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల దినం

పుత్తూరు మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజా ఫిర్యాదుల దినాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ డి.వి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇకపై ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల దినం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, రహదారులు, కాలువల నిర్మాణం, పన్ను విధింపు, భవన అనుమతులు, సచివాలయంలో అందుతున్న సేవలు తదితరాలపై ప్రజలు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

ఘనంగా సత్యసాయి జయంతి



వడమాలపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జన్మదిన వేడుకలను తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాబా శతజయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో శేషగిరిరావు, టీడీపీ నాయకులు దాముయాదవ్, శివరాయల్, మురళి ఆచ్చారి, చందు, చైతన్య రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



వడమాలపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాదిరేడులో అయ్యప్పమాల ధరించిన స్వాములు ఆదివారం అంబలం పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అరటి మట్టలతో ఏర్పాటు చేసిన పూజా మందిరంలో అయ్యప్ప పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వాములు పాటలు పాడుతూ పూజలు చేశారు. మెట్ల పూజ అనంతరం కర్పూర హారతులిచ్చారు. అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం


రమణ మహర్షి విగ్రహ ఆవిష్కరణ

పుత్తూరు టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పలమనేరు ధ్యాన కేంద్రం మాస్టర్ బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని త్రినేత్ర పిరమిడ్ ధ్యానమందిరంలో భగవాన్ రమణ మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడు నెలల పాటు శ్రమించి పవిత్ర విగ్రహాన్ని మూర్తిరూపంలోకి తీసుకువచ్చిన యోగా మాస్టర్ సుబ్రమణ్యం సేవలను ప్రశంసించారు. పది సంవత్సరాలుగా నిత్యం ఉదయం 5 గంటలకు ఉచిత యోగా శిక్షణ అందించడం గొప్ప విషయమన్నారు. యోగా గురువులు, ధ్యాన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానపథకానికి చెన్నైకు చెందిన సెల్వవర్షిణి దంపతులు ఆదివారం రూ.50,116ను విరాళంగా అందజేశారు. చెక్కును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయ రోడ్డుకు మోక్షమెప్పుడో?


బురదమయంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ రోడ్డు

రేణిగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం రెవెన్యూ సమస్యలు, వివిధ పనులు నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయ దారిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే బురదమయమై పోతోంది. దీంతో ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చే వారు, సమీపంలో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. బెంబేలెత్తుతున్నారు. దీనిపై గత తహసీల్దార్ రోడ్డు నిర్మించాలని పంచాయతీ అధికారులకు, ఎంపీడీవోను కోరినా పట్టించుకోలేదు. అలాగే వామపక్ష నాయకులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఇచ్చిన అర్జీలు బుట్టదాఖలయ్యాయి. పట్టణంలో అందరికీ అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని గత వైసీపీ హయాంలో అన్నాస్వామిపల్లె రెవెన్యూ పరిధిలో నూతనం భవనం నిర్మించి తరలించారు. అయితే అప్పట్లో గుంతలమయంగా ఉన్న రహదారిని మాత్ర పట్టించుకోలేదు. కాగా తహసీల్దార్ కార్యాలయం ఏపీఐఐసీ పరిధిలో ఉండడంతో ఇక్కడ మండల, పంచాయతీ నిధులు కేటాయించేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్ రెడ్డిని వివరణ కోరగా ... తమ పరిధి మేరకు రోడ్డు నిర్మించడానికి అంచనాలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు




మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎస్సీవీనాయుడు - వరదయ్యపాళెం, కేవీబీపురం తహసీల్దారు కార్యాలయాల్లో సత్యసాయి జయంతి వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రేమ తత్వమే సాయి బోధన అని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం బాబా శత వార్షికోత్సవాల సందర్భంగా సాయి సంకీర్తలు, విశేష భజనలు నిర్వహించారు. పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. సమాజ హితం కోసం ఆధ్యాత్మిక చింతన పెంపొందించడంతో పాటు సాగు, తాగునీరు, వైద్యసేవలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. డాక్టర్ చంద్రశేఖర్, సత్య సాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇక శ్రీకాళహస్తి పురపాలకసంఘ కార్యాలయంలో జరిగి వేడుకల్లో కమిషనర్ భవానీప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుధీర్ మాట్లాడుతూ ... సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవ విలువలను బోధించారన్నారు. మండల సర్వేయర్ వెంకటరమణ, బీజేపీ నాయకుడు పురుషోత్తం, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రోశయ్య ఆధ్వర్యంలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డైనింగ్ హాలు నిర్మాణానికి భూమిపూజ



బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్ల మాల ప్రాథమిక పాఠశాలలో న్యూయార్క్‌కు చెందిన అల్బని ఆంధ్ర అసోసియేషన్ ఆర్థిక సహకారంతో డైనింగ్ హాలు నిర్మాణానికి ఆదివారం ఎంఈవో రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా దాత మోహన మాట్లాడుతూ ... తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.1.48 లక్షలతో డైనింగ్ హాలును నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి అనువుగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు అనురాధ, వెంకటేశ్వరరావు, విజయభారతి, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రమీల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరు బాధితులకు వంట సామగ్రి వితరణ



కేవీబీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంపు గురైన కళత్తూరువాసులకు తిరుపతి రోటరీ క్లబ్, వేమన విజ్ఞాన కేంద్రం వారు 55 కుటుంబాలకు వంటసామగ్రిని పంపిణీ చేశారు. సుమారుగా రూ.1.50లక్షలు విలువైన వంట పాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన ట్రస్టు నిర్వాహకుడు నాగార్జున, రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంపటేల్, నారాయణ, రవీంద్రకుమార్, మార్కెండేయరెడ్డి, సుందర్రామ్ సహా సీపీఎం నాయకుడు జనార్దన్ పాల్గొన్నారు.

జలాశయంలో కొట్టుకువచ్చిన మొద్దు తొలగింపు



కేవీబీపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి జలాశయంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పెద్ద మొద్దు కొట్టుకువచ్చి గేట్లకు అడ్డంగా నిలిచింది. గమనించిన సిబ్బంది వెంటనే అధికారులు, ఆయకట్టు చైర్మన్‌కు రాజారెడ్డికి తెలిపారు. స్పందించిన రాజారెడ్డి ఎక్స్‌కవేటర్ సాయంతో మొద్దును తొలగించారు.

ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉచిత శిక్ష ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శాంతస్ఫూర్తిసేవ ఫౌండేషన్ సంస్థ పేర్కొంది. ఇంటర్ పాస్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్, నగర పరిధి నివాసులు, 18నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి మాత్రమే ఈ అవకాశం. వివరాల కోసం 90004 69989, 83091 54991 నెంబర్లను సంప్రదించవచ్చు.

క్వారీ పనుల అడ్డగింత


పూడిలో ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

కేవీబీపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి గ్రామాల్లో ఆదివారం సత్యసాయి క్రషర్‌కు చెందిన భారీ వాహనాలు గ్రామంలోకి ప్రవేశించాయి. దీంతో గ్రామస్తులు వాటిని అడ్డుకున్నారు. అయితే వారు తాము ఇక్కడ స్థలాన్ని కొనుగోలుచేసి క్రషర్ నిర్వహించేందుకు అనుమతులు తీసుకున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ క్వారీ పనులు చేయడానికి వీల్లేదంటూ వాహనాలను తిప్పి పంపారు. అనంతరం తహసీల్దారు రోశయ్యకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి పూర్తి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటానని చెప్పారు.

హోరాహోరీగా అంతర్‌జిల్లా అండర్-14 హాకీ పోటీలు

● నేడు సెమీఫైనల్స్

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రెండో రోజైన ఆదివారం అంతర్ జిల్లా అండర్-14 హాకీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. లీగ్ పోటీలను నాలుగు గ్రూపులుగా విభజించారు. వీటిలో విన్నర్స్, రన్నర్స్‌గా బాలుర జట్లు ఎనిమిది, బాలికల జట్లు ఎనిమిది నాకౌట్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ దశలో నిర్వహించిన బాలుర మొదటి క్వార్టర్ ఫైనల్‌లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి జట్ల మధ్య మ్యాచ్ జరగగా 4-3 గోల్స్‌తో విశాఖ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో కర్నూలుపై తూర్పుగోదావరి 4-0 గోల్స్‌తో, మూడవ మ్యాచ్‌లో కడప, నెల్లూరుపై 5-0 గోల్స్ తేడాతో, నాలుగవ మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళంపై 2-1 గోల్స్ తేడాతో గెలిచి, సెమీఫైనల్స్‌కి చేరాయి. అలాగే బాలికల మ్యాచ్‌ల్లో నాకౌట్ దశలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్‌లో మొదటి మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై, విశాఖపట్నం జట్టు 1-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై, తూర్పుగోదావరి 8-0 గోల్స్ తేడాతో, మూడో మ్యాచ్‌లో కడప, నెల్లూరుపై 9-0 గోల్స్ తేడాతో, నాల్గవ మ్యాచ్‌లో అనంతపురం జట్టు, కర్నూలు జట్టుపై 7-0 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌కి ప్రవేశించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్, భార్గవి, దేవి, అబ్జర్వర్ థామస్, ఆర్కేసెలవపాండెంనే, కేశవయ్య, హరికృష్ణ, కిరణ్‌కుమార్, ప్రభాకర్, జేమ్స్, చంద్రశేఖర్, శ్రీనివాసులు ఆచారి, కిరణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

నేటి సెమీఫైనల్స్

బాలుర జట్లలో విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య మొదటి సెమీఫైనల్, కడప, అనంతపురం జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. బాలికల జట్లలో మొదటి సెమీఫైనల్ వైయస్సార్ కడప, విశాఖపట్నం జట్ల మధ్య. రెండో సెమీఫైనల్ తూర్పుగోదావరి, అనంతపురం జిల్లా జట్ల మధ్య జరుగనున్నాయి.



చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హాకీ ఆడుతున్న బాలురు, బాలికల జట్లు

'రైతన్న మీకోసం'ను విజయవంతం చేద్దాం


వివరాలు వెల్లడిస్తున్న గురవారెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతన్న మీకోసం పథకం ఈనెల 24న సోమవారం నుంచి ప్రారంభమవుతుందని దాన్ని విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ఐదు సూత్రాల కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నాయకులు అవగాహన కల్పించాలన్నారు. రాఘవులు, మునెయ్య, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన మహమ్మద్ షఫీని పలువురు ముస్లిం నాయకులు సన్మానించారు. షఫీకి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే సుధీర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, టౌన్‌బ్యాంకు చైర్మన్ ఖాదర్‌బాషా, జహీర్, ఖలీల్‌బాషా, మీర్జా, మస్తాన్, షఫీ, ఖాదర్, మహ్మద్ రఫీ, అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపల్లి సమీపంలో ఉన్న ఎస్‌వీఎస్‌లో ఆదివారం టెన్త్ విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల పరిధిలో సుమారు 10 గ్రామాలకు చెందిన వందమంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి రిసోర్స్ పర్సన్ రత్నకుమార్ కెరీర్‌పై అవగాహన కల్పించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి-2 మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తుమ్మలగుంట గ్రామం, తిరుపతి రూరల్‌లోని ఇంటి నెం. 3-78రులో యుండు ఎం.శరణ్య, W/o శ్రీనివాసులు గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు ఎం.శరణ్య గారికి ఋణము ఇవ్వుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఋణాలు, దార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 5 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : SCHEDULE-A : All that piece and parcel of the land situated in chittoor District. Sri Balaji Registration District., Tirupati sub-District., Tirupati urban Mandal, Tirupati Town Municipal No.6th ward, located Thyagaraja Nagar, Town Survey No.77 & 83/2 with the following boundaries :- East: Veera Raghavulu House No.6-2-104, West : 40ft Municipal Road, North : C.Ramalakshmi House, South: 18 feet Municipal Road, And measuring East to West 83.6ft or 25.450mts., North to South 41ft or 12.496mtrs., Admeasuring 3427.6sq.ft., or 380.84sq.yards of land only. SCHEDULE-B : Forming part of the "A" schedule property herein above and Property sold to the purchaser under this deed 1/14th (one by Fourteenth) undivided share in the "A" Schedule Property is equal to 27.20sq.yards Land/Site only. SCHEDULE-C : (This Property sold by the vendor to the vendee under this deed) All that portion of the building or framed structures "Flat" Fully Finished. A residential Apartment bearing Flat No.4A, Municipal Door No.6-2-105/B/401 in the Fourth Floor, admeasuring 1064sq.ft (including common area) "CHEBROLU RESIDENCY" Constructed in premises described in "A" Schedule. The Flat No.4A Bounded on East : Flat No.4B, West : Open to Sky; North : Open to Sky; South : Open to Sky. The Flat having Doors, Door frames, windows, ventilators, Electricity Service Connection No.66043, wiring with all amenities etc.,

జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్, డో.నెం.8-114/2 రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Sullurpet బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీ గుంటకిందపల్లి తులసిరాం తండ్రి లేట్ గుంటకిందపల్లి ఉత్తరెడ్డి, వంగూరు గ్రామం & పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని ఋణం ఇవ్వుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు, ధార్జీలు క్లెయిమ్‌లు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

తిరుపతి డిస్ట్రిక్ట్, శ్రీకాళహస్తి సబ్ డిస్ట్రిక్ట్, శ్రీ కాళహస్తి మున్సిపాలిటి, శ్రీ కాళహస్తి టౌన్, పానగల్లు 16వ వార్డు, డోర్ నెం.16-482/2 గల ఇంటికి సమీపమున పానగల్లు లెక్క దాఖలా సర్వే నెం.207/1ఎలో భాగమైన ప్లాటు నెం.17 గల ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు ప్లాటు నెం.18 స్థలం, దక్షిణం: ప్లాటు నెం.31 స్థలం, పడమర: ప్లాటు నెం.16 స్థలం, ఉత్తరం: 20 అ.లు వెడల్పు గల రోడ్డు. ఈ హద్దులలోని తూర్పు నుండి పడమరకు (ఇరువైపుల): 30 అ.లు మార్చు 9.14 మీ.లు, ఉత్తరం నుండి దక్షిణమునకు (ఇరువైపుల): 50 అ.లు మార్చు 15.24 మీ.లు వెరసి 1500 చ.అ.లు మార్చు 166.66 చ.గలు మార్చు 139.33 చ.మీ.లు గల ఖాళీ స్థలం మాత్రం.

S.Sreeramulu Yadav, M.A., B.L., Advocate, Off: 3-2-155, old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Renigunta బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీమతి పున్నం సామ్రాజ్యం భర్త పున్నం హరినాథనాయుడు, పొయ్య గ్రామం& పోస్టు, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీమతి ఆర్.మాధవి భర్త ఆర్.హరినాథ నాయుడు గారికి ఋణం ఇవ్వుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారము నకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు, ధార్జీలు క్లెయిమ్‌లు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

[illegible] S.No.92/1B, [illegible] H.S.C.Nos. 1644, 17428, [illegible] నెం.5710[illegible]

A.Ananda Kumar, M.Sc., M.A., B.L., Advocate, Opp:Cotton Mill, Renigunta Road, Tirupati. Cell: 98665 09592